ప్రజాశక్తి

ఆదివారం 25 మే 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పల్నాడులో జంట హత్యల కలకలం

టిడిపిలో పెరుగుతున్న వర్గ పోరు - పాత, కొత్త నేతల మధ్య కుదరని సయోధ్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడుజిల్లాలో రాజకీయ ఆధిపత్య ధోరణలు పెరుగుతున్నాయి. అధికారం కోల్పోయిన వెంటనే వైసిపి వారు అనేక మంది గ్రామాలు విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. పలు గ్రామాల్లో టిడిపిలోనే వర్గ పోరు తీవ్ర మవుతోంది. ప్రధానంగా ఎన్నికల ముందు టిడిపిలో చేరిన వారికి, దీర్ఘకాలికంగా టిడిపిలో ఉన్న వారికి మధ్య సయోధ్య కుదరక వీరంతా ఉప్పు, నిప్పులాగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ఈ పరిస్థితి మాచర్ల, గురజాల నియోజకవర్గాలలో ఎక్కువగా కన్పిస్తుంది. అలాగే పల్నాడులోని మరికొన్ని నియోజక వర్గాల్లో టిడిపి, జనసేన మధ్య కూడా సయోధ్య కుదరక ఘర్షణలు జరుగుతున్నాయి. తాజాగా వెల్దుర్తి మండల పరిధిలోని బోదలవీడు వద్ద స్కార్పియో వాహనంతో ఢీకొట్టి, మారణాయుధాలతో దాడి చేసి ఇద్దరు అన్నదమ్ములను హత్య చేసిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు ఉరఫ్ మొద్దయ్య, అతని తమ్ముడు కోటేశ్వరరావును అదే గ్రామానికి చెందిన తోట వెంకటరామయ్య, జెవిశెట్టి

మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

శ్రీనివాసరావు అలియాస్ బొబ్బిలి తోపాటు మరికొంత మంది కలిసి వీరిని దారుణంగా హత్య చేయడం పల్నాడులో కలకలం రేపింది. టిడిపిలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో హత్యలు జరగ్గా వీటి వెనుక వైసిపి నేతల హస్తం ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆరోపించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన గురించి తెలియగానే పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి గొట్టిపాటి రవికుమార్ మాచర్ల ఎమ్మెల్యేతో, ఎస్‌పి శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనకు కారణాలను ఎస్‌పిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై ఆయన హోంమంత్రితో మాట్లాడారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహించబోమని, నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. ఈఘటన టిడిపి అధిష్టానం సీరియస్‌గా పరిగణించింది. హుటాహుటీన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే జూల కంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వెల్దుర్తి మండలం

2లో

విజయం సాధించిన మున్సిపల్ కార్మికులు

66 రోజుల దీక్షలకు ఫలితం - నేటి నుండి విధులకు హాజరు

మండే ఎండలు, భారీ వర్షాల్లో సైతం కార్మికులు మొక్కవోని కార్మికుల దీక్షలకు ఫలితం దక్కింది. ఎట్టికేలకు అధికారులు దిగివచ్చారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. 66 రోజుల నిరవధిక దీక్షలను ముగించిన కార్మికులు ఆదివారం నుండి విధులకు హాజరు కానున్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అధికారులతో చర్చల్లో పాల్గొన్న నాయకులు , కార్మికులు

ఆప్కాస్‌లో ఉన్నప్పటికీ తోటి కార్మికులతో పాటు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం, నెల మొత్తం పని చేసినా సగం రోజులకే వేతనాలు ఇవ్వడాన్ని ప్రశ్నించినందుకు విధులకు హాజరు కావొద్దన్న అధికారుల తీరును నిరసిస్తూ ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మి కులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 66 వ రోజుకు చేరుకుంది. భగభగ మండే ఎండ, అకాల వర్షాలు అయినప్పటికీ భిక్షాటన చేసి, మెడకు ఉరి తాడు బిగించుకుని, అంబేద్కర్, గాంధీ విగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేసి పలు విధాలుగా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల పోరాట పటిమకు ఎట్టకేలకు దిగొచ్చిన అధికారులు శనివారం సిఐటియు నాయకులతో చర్చలు జరిపారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్, ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివ కుమారి, సిఐటియు మండల కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ ఆధ్వర్యంలో కార్మికుల సమక్షంలో మున్సిపల్ కమిషనర్ చర్చలు జరిపారు. కార్మికులను కొనసాగించి మెరుగైన వేతనాలు ఇస్తామని కమిషనర్ ఎం జస్వంత్ రావు హామీ ఇచ్చారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ చర్చలు సానుకూలంగా జరిగాయని, సమ్మె కాలానికి కూడా సగం వేతనాలు ఇవ్వాలని, వేతనాల చెల్లింపులు ఆప్కాస్ ద్వారా చేయాలని డిమాండ్ చేశామన్నారు. అదేవిధంగా పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో కొత్తగా కార్మికులను తీసుకోవాలన్న ప్రతిపాదన ఉన్న నేపథ్యంలో

2లో

నల్గురు నిందితులపై పీడీ యాక్టు

రాజమండ్రి జైలుకు తరలింపు : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడాలంటే నేరస్తుల గుండెల్లో భయం ఏర్పడేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. మంగళగిరి టౌన్, చేబ్రోలు, వట్టి చెరుకూరు, తెనాలి 3 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తరచూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే నలుగురి నిందితులపై నమోదైన పలు కేసుల దృష్ట్యా వారిపై పీడీ చట్టం అమలుకు పోలీసు అధికారులు జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. ఈ ప్రతిపాదనలను జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ తేజ ఆమోదించారని జిల్లా ఎస్‌పి శనివారం మీడియాకు తెలిపారు. సంబంధిత నిందితులను రాజమండ్రి జైలుకు పంపుతున్నామన్నారు. ఇప్పటికే టి.విజయబాబు (తెనాలి) అనే నిందితుడు రాజమండ్రి జైలులో ఉన్నారని మిగతా ముగ్గురు బుల్లా మనోజ్ (మంగళగిరి), అల్లం సాయి సాంబశివరావు (ముట్లూరు, వట్టిచెరకూరు) పోతినేని గోపి (వేజండ్ల చేబ్రోలు మండలం) లను రాజమండ్రి జైలుకు పంపుతున్నామని వివరించారు. వీరందరూ మాదకద్రవ్యాల రవాణా, కొట్లాటలు, దొంగతనాలు, దోపిడీలు, అత్యాచారాలు, హత్య ప్రయత్నాలు మొదలగు పలు కేసుల్లో నిందితులుగా ఉంటూ చట్టంపై ఎటువంటి గౌరవం లేకుండా పదేపదే నేరాలకు పాల్పడుతూ ప్రజల యొక్క స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తుండటంతో వీరిపై పిడి యాక్టు అమలుకు సిఫార్సు చేశామన్నారు. ఇంకా మరికొందరుపై పీడీ యాక్టు అమలుకు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయన్నారు. ఇటువంటి నేరాలకు పదేపదే పాల్పడుతూ పలు కేసుల్లో నిందితులపై పీడీ చట్టం ప్రయోగానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. అలాగే ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తొలిదశలో రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పీడీ యాక్టుల ప్రతిపాదనలు చేసిన వారిలో అదనపు ఎస్‌పిలు రమణమూర్తి, కె.సుప్రజ, న్యాయస్థానాల వ్యవహారాల పర్యవేక్షణ అధికారి నరసింహారావు, తెనాలి త్రీటౌన్ సిఐ రమేష్, వట్టిచెరుకూరు సిఐ రామానాయక్, చేబ్రోలు సీఐ కోటేశ్వరరావు, మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్‌ను ఎస్‌పి అభినందించారు.

గుంటూరులో భారీ వర్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సాయంత్రం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గుంటూరులో రాత్రి 8 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. డొంకరోడ్డు మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యుబి వద్ద వర్షం నీరు నిలిచింది. భారీ వర్షం, విద్యుత్ సరఫరా లేక అంతటా అంధకారం అలుముకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల చెట్లు కూలాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దాదాపు 40 ఏళ్ల చరిత్ర కలిగిన వృక్షాలు సైతం నేలకూలాయి. పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. గుంటూరులోని పలు ప్రాంతాల్లో కంకరగుంట ఆర్‌యుబి, డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద వర్షపునీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. రోడ్లపైకి వర్షం నీరు చేరి రోడ్లన్ని బురదమయంగా మారాయి. వేసవి కాలంలో ఇంత భారీ వర్షం ఇటీవల కాలంలో ఇదే మొదటి సారి అని అధికారులు తెలిపారు. వర్షాలకు రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులకు అంతరాయం కల్గింది. గుంటూరు లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేక తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వట్టిచెరకూరు, పెదకాకాని, కాకుమాను, తాడికొండ, పెదనందిపాడు మండలాల్లో భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



ఎండియు వాహనాలు కొనసాగించాలి

కలెక్టరేట్ ఎదుట ఆపరేటర్ల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ఎండియు వాహనాల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైఖ్య ఎండియూస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి సి.సాంబశివరావు కోరారు. ఈ మేరకు గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఎండియు ఆపరేటర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ 2021 ఫిబ్రవరి 1 నుండి ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇబిసి కార్పొరేషన్ల ద్వారా ఎండియు వాహనాలు అందుబాటులోకి వచ్చాయని, కానీ కూటమి ప్రభుత్వం ఎండియు వాహనాలు రద్దు చేయటం వల్ల 9260 మంది ఆపరేటర్లు, 9260 మంది హెల్పర్లు ఉపాధి లేకుండా పోయారన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల రాత్రికి రాత్రే రోడ్లపాలు అయ్యామన్నారు. ఈ వ్యవస్థ రద్దు చేయటం వల్ల 2-3 కిలోమీటర్లు నడిచి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. ఎండియు ఆపరేటర్లతో 2027 జనవరి వరకూ ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఉందన్నారు. గతంలో రేషన్ డీలర్లు చేస్తున్న అవినీతిని అరికట్టడానికి 2015లో చంద్రబాబునాయుడు ప్రభుత్వం డిజిటల్ కాటా, ఈపోస్ మిషన్లు ప్రవేశపెట్టిందని, అయినా అక్కడక్కడా డీలర్ల దగ్గర బకాయిలు సుమారుగా 30 బస్తాల నుండి 150 బస్తాల వరకూ వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. డీలర్ల అవినీతి కోసం ఎండియు వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.డీలర్లపై 6వేలకుపైగా 6ఎ కేసులు, ఇంకా ఇతర కేసులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయం వదిలిపెట్టి ప్రభుత్వం అక్రమ రవాణా చేస్తున్నది ఎవరన్నది గుర్తించకుండా మాట్లాడటం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎక్కడైనా మాకు రేషన్ అందలేదని, టైంకు అందలేదని ఎక్కడైనా చెప్పారా అని ప్రశ్నించారు. 78 శాతం ప్రజలు ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థ కావాలని ఆమోదం తెలిపారన్నారు. ప్రభుత్వానికి కొంత భారమైనా ఈ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఎండియు వాహనాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న ఆపరేటర్లు

రాయితీపై పశుదాణా

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశు పోషకులకు 50 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్న పశువుల దాణాను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు కోరారు. రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామ వైద్య శాల ప్రాంగణంలో రాయితీ పశు దాణా సంచులను డాక్టర్ అవుల సాయి మహేష్ రెడ్డి, గ్రామ టిడిపి నాయకులు వడ్లమూడి వెంకట కిషోర్ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాంతారావు మాట్లాడుతూ దాణాలో 25 శాతం మాంసకత్తులు ఉంటాయని ఆయన పశు పోషకులకు వివరించారు. పాల దిగుబడి, వెన్న శాతం పెరిగి పశు పోషకులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని వెల్లడించారు. పశుపోషకులు 80 శాతం రాయితీతో పశువులకు ఆవులకు, ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ రాయితీ పోను 3 ఏళ్ల కాలానికి పశు పోషకులు రూ 30 వేలు విలువ చేసే పశువుకు రూ 1920 గాను రాయితీ పోను రూ 288 చెల్లించాలని వివరించారు. భీమా చేయించుకోవడం ద్వారా పశువులు, ఆవులకు, ఎంతో రక్షణ ఉంటుందన్నారు. 50 శాతంపై దాణా కోసం ముందుగా పశు పోషకులు తమ గేదెలు, ఆవులకు, 80 శాతం రాయితీతో ప్రభుత్వం కల్పిస్తున్న భీమా చేయించుకోవాలని కోరారు. అదేవిధంగా గొర్రెలు, మేకలకు, 3 ఏళ్ల కాలపరిమితికి ప్రభుత్వ రాయితీ పోను రూ 56 రూపాయలు చెల్లించి బీమా చేయించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ అవుల సాయి మహేష్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలకు పిడుగులు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో చెట్ల కింద పశువులు, గొర్రెలు, మేకలను నిలపరాదన్నారు. పశువులకు లవణ మిశ్రమాలను అధికంగా పెట్టాలన్నారు. గ్రామ టిడిపి నాయకులు వడ్లమూడి వెంకట కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు పశు పోషకులకు అనేక సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఆయా సంక్షేమ పథకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివద్ధి సాదించాలన్నారు. మినీ గో కులాలు పేరిట పసువుల షెడ్లను నిర్మిస్తున్నారన్నారు.వ్యాధి నిరోధక టీకాలు, మెరుగైన పశు వైద్య సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పశు పోషకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పశు పోషకులకు మిశ్రమ దాణా పంపిణీ చేస్తున్న వైద్యులు

గుంటూరు పశ్చిమ అభివృద్ధి ప్రత్యేక ప్రణాళికలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శనివారం గుంటూరు 45వ డివిజన్ లో చైతన్యపూరి, గౌతమి నగర్ లో సుమారు రూ. 72.20 లక్షల అభివధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర కలసి శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులలో ప్రధానంగా చైతన్యపురి మెయిన్ రోడ్డులో రూ.50 లక్షలతో 190మీటర్ల సీసీ రోడ్డు మరియు 320మీటర్ల డ్రెయిన్లు (ఇరువైపుల) అదేవిధంగా పలు అభివృద్ధి పనులకు వారు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌళిక వసతులు కల్పిస్తాననిహామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు 45వ డివిజన్ చైత్యన్యపూరి, గౌతమి నగర్‌లో రూ.72.20 లక్షలతో సిసి రోడ్లు, డ్రైన్లు ఆర్ సిసి కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయటం జరిగింది. మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా సరఫరా చేశామన్నారు. అదేవిధంగా నేడు వర్షాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని కాలువల్లో పూడికతీత వంటి పనులకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. మేయర్, కార్పొరేటర్ల సహకారంతో నియోజవర్గాన్ని అభివద్ధి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీనిచ్చారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు వేగంగా జరుగు తున్నాయన్నారు. గత వైసిపి హయాంలో సిసి డ్రైన్లు కూడా నిర్మించకపోవటం వలన వర్షాకాలంలో వరదలు వచ్చాయి. తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలతో కలసి సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో నియోజకవర్గం గ్రీన్ అండ్ క్లీన్ నియోజకవర్గంగా తయారు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వర రావు, కొమ్మినేని కోటేశ్వరరావు, బెజవాడ కృష్ణా రెడ్డి, కూరుకుల శోభా రాణి, రఫీ, ములక సత్య వాణి,బాజీ, దుడికి సాంబయ్య, నాగుల్ మీరా,రామారావు తదితరులు పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి సేవలో ఎమ్మెల్యే గళ్ళా మాధవివిద్యానగర్ 1వ లైన్ నందు ఆలయ నిర్వాహకులు కొల్లి అనిల్, బాలకృష్ణ ల ఆహ్వానం మేరకు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించారు.

పల్నాడులో జంట హత్యల కలకలం

(మొదటి పేజీ తరువాయి)

గుండ్లపాడు గ్రామంలో వడ్డెర సామాజివర్గానికి చెందిన ఇరు వర్గాల మధ్య గొడవకు సంబంధించి పోలీసులకు చెప్పి ఇరువర్గాలపై కేసులు నమోదు చేయించా మన్నారు. వారిలో వెంకట్రామయ్య అనే వ్యక్తి వైసిపి నాయకులతో సన్నితంగా ఉంటున్నాడని మందలించడం జరిగిందని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న పల్నాడు ప్రాంతంలో చిన్న చిన్న గొడవలను కూడా అవకాశంగా తీసుకొని కొంత మంది నాయకులు అలజడులు సష్టిస్తున్నారని ఆరోపించారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని తాము ప్రయత్నిస్తుంటే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి అతని సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఇలాంటి హత్య రాజకీయాలకు తెర తీస్తున్నారని ఆరోపించారు. ఈ జంట హత్యలో కూడా వారి ప్రమేయం ఉందని ఆరోపించారు. మాచర్ల నియోజకవర్గంలో పోలీస్ ప్రక్షాళన జరగాలని కోరారు. చనిపోయిన కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే జూలకుంట బ్రహ్మానందరెడ్డి కోరారు.

27వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య ఆరోగ్య శాఖలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న కమూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె శనివారంతో 27వ రోజుకు చేరుకుంది. గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె శిబిరంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లింగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు జి.వనజ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం సిచ్‌ఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని కోరారు. రెండు సంవత్సరాలుగా పేరుకుపోయి ఉన్న సమస్యల పరిష్కారం కొరకు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో సమ్మె చేపట్టామని, దాదాపు నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం స్పందించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమబద్దీకరణ, ప్రోవిడెంట్ ఫండ్ తదితర అంశాలపై అసోసియేషన్‌తో చర్చించి స్పష్టమైన హామీ ఇవ్వాలని జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవళిక కోరారు. జిల్లా నాయకులు సంధ్య, దీక్షిత, రవితేజ, జీవన జ్యోతి, కె.లక్ష్మి, రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

విజయం సాధించిన మున్సిపల్ కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

సమ్మెలో పాల్గొన్న కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆప్కాస్ లో ఉన్న కార్మికులకు మిగతా కార్మికులతో పాటు ప్రతి కార్మికునికి రూ 21 వేలు వేతనాల సాధనకు సిఐటియు ఆధ్వర్యంలో భవిష్యత్తులో పోరాటాలు చేపడతామని అన్నారు. డిమాండ్ల సాధన కోసం 66 రోజులు పాటు నిరవేదిక సమ్మెలో పాల్గొన్న కార్మికులను అభినందించారు. పోరాటాల ద్వారానే హక్కులను డిమాండ్లను సాధించుకోవాలని ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో పోరాటాలు చేయాలన్నారు.

నేడు టిడిపి జిల్లా మహానాడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి జిల్లా మహానాడు ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని పార్టీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య తెలిపారు. జిల్లా మహానాడులో 14 తీర్మానాలు చేయనున్నామని తెలిపారు. జిల్లా మహానాడు కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా టిడిపి అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా కమిటీ అనుబంధ సంఘ సభ్యులు, గుంటూరు కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ పాల్గొంటారని తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి పర్యటన

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం నగరంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి సంక్షేమపథకాలపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం టిడిపి మహానాడులో పాల్గొంటారు. పార్టీ కార్యకర్తలతో భేటి అవుతారు.

కరాటే సాధనతో ఆత్మస్థైర్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్

పాఠశాల దశ నుంచి కరాటే సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని కె.బి.ఎన్.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే తరగతుల్లో శిక్షణ పొంది, వివిధ బెల్ట్ గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులకు బెల్ట్‌లు శనివారం అందించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ కరాటే సాధన ద్వారా శారీరకంగా చక్కటి ఆరోగ్యం పొందవచ్చని, క్రమశిక్షణ కూడా అలవాటవుతుందన్నారు. హిందూ హైస్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తమ కళాశాల పక్షాన పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మానసిక దృఢత్వానికి కరాటే సాధన దోహదం చేస్తుందన్నారు. అనంతరం, విద్యార్థులకు బెల్ట్‌లు అందించి, అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, కరాటే శిక్షకురాలు జి.వరలక్ష్మీ దేవి పాల్గొన్నారు.

సంతగుడిపాడు గ్రామంలో దుక్కి దున్నుతున్న రైతు, నరసరావుపేట మండలం, ఇక్కుర్రు గ్రామ పరిధిలోని పొలంలో నిలిపిన గొర్రెల మంద

నేలకు ఎరువు- కాపరికి భత్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

- సాగు భూమి సారం కోసం గొర్రెల మందలను నిలుపుతున్న రైతులు
- గొర్రెల విసర్జితాలతో పెరగనున్న భూసారం
- పాత పద్ధతుల వైపు మొగ్గు చూపుతున్న రైతులు
- పశువుల ఎరువుకు ఏర్పడ్డ కరువు

అధిక దిగుబడులు సాధించాలని రైతులు విచక్షణా రహితంగా రసాయన పురుగు మందులు ఎరువులు వాడడం వలన భూములు నిర్జీవంగా మారుతున్నాయి. దీంతో పంటలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మజీవులు వాటి ద్వారా లభించే సేంద్రియ పదార్థాలు సూక్ష్మపోషక పదార్థాలు పూర్తిగా నశించి పంటల ఎదుగుదల లోపిస్తుంది. రైతులు సేంద్రియ, పశువులు, గొర్రెల ఎరువు ద్వారా సమగ్ర ఎరువుల యాజమాన్య విధానాలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం పంటల కాలం పూర్తి కావడంతో రైతులు దుక్కులు దున్నడం, భూమిలో సారం పెంచేందుకు పశు వుల ఎరువులు పంట పొలాలకు తరలించడం వంటి పనులలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం పాడి పరిశ్రమ గిట్టుబాటు కాక ఇంటికి పదుల సంఖ్యలో ఉన్న పశువుల సంఖ్య ప్రస్తుతం పది ఇళ్లలో ఒకరిద్దరు మాత్రమే తక్కువ సంఖ్యలో పశువు లను పోషిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలలో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పశువుల ఎరువుకు కరువు ఏర్పడింది. ఈ నేపథ్యంలో గొర్రెల మంద కట్టించి సాగు భూమికి ఎరువు అందిస్తున్నారు రైతులు. వ్యవసాయ రంగం అధునాతన పద్ధతులతో ఎన్ని కొత్త పుంతలు తొక్కుతున్నప్పటికీ రైతులు కొన్ని పాత విధానాలు అవలంభిస్తున్నారు. ఎరువుల భారం ప్రతి సంవత్సరం పెరిగి వ్యవసాయం భారంగా మారుతున్న నేపథ్యంలో రైతులు పెట్టుబడిని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయంగా పాత విధానాల వైపు మొగ్గుచూపుతున్నారు. గొర్రెల మందలను పొలాల్లో నిలబెట్టి వాటి మల విసర్జితాలను ఎరువుగా ఉపయోగించే పద్ధతులను మళ్లీ ముమ్మరం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పల్నాడు జిల్లా వ్యాప్తంగా అనేక మండలాలలో స్థానిక గొర్రెల పెంపకం దారులతో పాటు, ప్రకాశం, బాపట్ల జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి గొర్రెల కాపరులు పల్నాడు జిల్లాకు గొర్రెలను మేపుకుంటూ వచ్చి రాత్రి వేళ పొలాలలో నిలిపి రైతులు వద్ద ఆ రోజు ఆహారంతో పాటు గొర్రెల సంఖ్యను బట్టి ఎకరాకు రూ 1 వెయ్యి వరకు వెచ్చించి 3 నుండి 4 రోజుల పాటు ఈ విధానంలో పల్నాడు జిల్లాలో వేలాది ఎకరాలలో మంద కట్టించి భూసారం పెంచుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో పల్నాడు ప్రాంతంలో అన్ని మండలాలలో గొర్రెల మందలు అత్యధికంగా కనిపిస్తున్నాయి. ఖరీఫ్, రబీకి మధ్యకాలంలో పంట పొలాల్లో గొర్రెలను తిప్పడం ద్వారా గొర్రెలకు ఆహారం లభించడంతో పాటు గొర్రెలు విసర్జించే మల మూత్రాలు పొలాలకు ఎరువుగా ఉపయోగపడతాయి. ప్రస్తుతం గొర్రెల మందలను పంట పొలాల్లో మంద కట్టేందుకు మునుపెన్నడూ లేని విధంగా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పంట పొలాలకు గొర్రెల ఎరువుతో ఎంతో మేలు : ఏడిఏ పి.మస్తానమ్మ

పంట పొలాల్లో గొర్రెలను నిలపడం ద్వారా రసాయనిక ఎరువులు వేయకుండానే భూసారాన్ని పెంచుకోవచ్చు. గొర్రెల మంద కట్టడం ద్వారా సంప్రదాయ పద్ధతిలో భూసారం పెరుగుతుంది. గొర్రెల మందను ఉంచడం వలన వాటి విసర్జన వల్ల పంటల దిగుబడి పెరుగుతుంది. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం పెరిగిన నేపథ్యంలో భూమిలో సూక్ష్మ పోషకాలు అంతరించి పంటలు సరిగా పండడం లేదు. వీలైనన్ని ఎక్కువ రోజులు గొర్రెల మందలను పొలంలో ఉంచడం, పశువుల ఎరువు భూమిలో బాగా కలియ దున్నడం శ్రేయస్కరం. గొర్రెల ఎరువులో నత్రజని, భాస్వరం, పొటాషియం సమఅర్ధిగా ఉండి నేల సారం పెరిగి సేంద్రియ పదార్థాన్ని అందిస్తుంది. నత్రజని మొక్కల ఎదుగుదలకు, ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదం చేస్తుంది. భాస్వరం వేర్ల అభివృద్ధికి ఆరోగ్య కరమైన ఉత్పత్తుల దిగుబడికి అదేవిధంగా పొటాషియం మొక్కల ఆరోగ్యం తెగుళ్ల, చీడ పీడలను తట్టుకునే శక్తిని అందజేస్తుంది. రాగి, మాంగనీస్, జింక్ వంటి సూక్ష్మపోషకాలు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు.

మాట్లాడుతున్న వక్తలు

నవ్వుతో సానుకూల దృక్పథాన్ని పెంపొదిద్దాం

ప్రజాశక్తి - గుంటూరు

జీవితాన్ని వృధా చేయవద్దని, నవ్వుతూ నవ్విస్తూ మన చుట్టూ ఉన్న వారిలో సానుకూల దృక్పథాన్ని పెంపొదిద్దామని, తద్వారా మనతోపాటు తోటి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని హాస్య ప్రియులు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహనసంస్థ కార్యాలయంలో శనివారం హాస్యవల్లరి బృంద సభ్యుల ఆధ్వర్యంలో 'నవ్వండి-నవ్వించండి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యన్నారాయణ మాట్లాడుతూ హాస్యం ఒక ఆప్త మిత్రుని వంటిదని, అది మనల్ని నవ్విస్తుందని, గొప్ప ఔషధంలా కూడా పని చేస్తుందన్నారు. నవ్వు నాలుగు విధాల చేటు అన్న నానుడి నేడు నవ్వు నలభై విధాల గ్రేటు అన్న సూక్తిగా మారిందదన్నారు. ప్రముఖ మెజీషియన్ ఆర్.పి.ఎల్. నరసింహారావు మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించుకోవటానికి విరుగుడు అని అన్నారు. అనంతరం జోక్‌లు, వ్యంగ్య సంభాషణలు, కామెడీ స్కిట్స్‌తో హాస్యప్రియులు ప్రసాద్, గుప్త, పింగళి భాగ్యలక్ష్మి, జమదగ్ని, వి.వి.రావ్, అప్పారావు అందర్నీ నవ్వించారు.

విదేశీ ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గ్రీస్ దేశంలో ఐటీ & టెలికాం సేవల్లో నెట్ డెవలపర్స్, ఎంఎస్ ఎస్.క్యూ.ఎల్. డెవలపర్స్ ఉద్యోగాల కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్య అభివఅద్ధి అధికారి తమ్మాజిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ పాత్ర ఐటీ & టెలికాం సేవలు, విద్యార్హతలు, నెట్ డెవలపర్స్ & ఎంఎస్ ఎస్.క్యూ.ఎల్.డెవలపర్స్ ఉద్యోగాలకు 35 ఏళ్లలోపు వయసు, 5 ఏళ్ల అనుభవం కలిగిన పురుషులు అర్హులన్నారు. 2 ఏళ్ళ ఒప్పంద కాలం కాగా భారత కరెన్సీలో రూ.26 లక్షల వార్షిక వేతనం ఉంటుందన్నారు. ఉద్యోగ స్థలం కంపెనీ ప్రధాన కార్యాలయం కల్లితీయాలో ఉంటుందన్నారు. సోమవారం నుండి శుక్రవారం వరకు ఉదయం 10:00 నుండి సాయంత్రం 6:00 వరకు పని గంటలని, ఏడాదికి 20 రోజులు సెలవులు ఇవ్వబడతాయని, ఎంపిక ప్రక్రియ ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ టెస్ట్, టెక్నికల్ స్కిల్స్ అసెస్‌మెంట్ ద్వారా జరుగుతుందని, అభ్యర్థులు గమ్యస్థాన దేశంలో ఆహారం, రవాణా, మెడికల్ టెస్ట్ ఖర్చులు, వీసా, విమాన ఛార్జీలు భరించాల్సి ఉంటుందన్నారు. కంపెనీ పోస్ట్ కాంట్రాక్ట్ జాబ్ ఆప్షన్, సామాజిక భద్రత, బీమా, పని ప్రదేశానికి దగ్గరలో 2 పడకల షేర్డ్ ఫ్లాట్‌లో వసతి కల్పిస్తుందని తెలిపారు. అవసరమైన పత్రాలు పాస్‌పోర్ట్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్, సంబంధిత విద్యా ధృవపత్రాలతో జూన్ 10 వ తేదీలోగా https://naipunyam.ap.gov.in/user-registration, page Rprogram- registration అనే లింక్‌ను సందర్శించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. skillinternational@apssdc.inకు పంపాలన్నారు. మరిన్ని వివరాల కోసం వీరాంజనేయులు: 9160200652, ఏపీఎస్-ఎస్డీసీ కమాండ్ కంట్రోల్ నంబర్లు 9988853335, 8790117279 అనే నంబర్లలో సంప్రదించగలరని తమ్మాజీరావు కోరారు.

వైసీపీ కేంద్ర కార్యాలయం సమీపంలో ఎగిసిపడుతున్న మంటలు

వైసీపీ కేంద్ర కార్యాలయం సమీపంలో మంటలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయం మరియు మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నివాసముంటున్న రోడ్డు సమీపంలో శనివారం రాత్రి మంటలు చెల రేగాయి. గతంలో ముఖ్యమంత్రి ఇంటి ముందు ఏర్పాటుచేసిన గ్రీనరీలో నిప్పంటుకుంది. ప్రస్తుతం జగన్ ఇంటి సమీపంలోని రోడ్డు అవతలపక్క ఫెన్సింగ్ అవతల సీతానగరం రవీంద్ర పాడు బకింగ్ హెూమ్ కాలువ కట్ట పక్కన మంటలు చెల్లరిగాయి. కలవ కట్ట వెంట పెద్ద ఎత్తున వ్యర్థాలు పోగుబడి ఉన్నాయి. ఎవరు ఆకతాయిలు వీటికి మంటలు పెట్టి ఉంటారని భావిస్తున్నారు. వైసిపి కేంద్ర కార్యాలయ వర్గాలు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి - గుంటూరు

నేటి అస్తవ్యస్త అనారోగ్య ప్రపంచానికి ఏకైక విరుగుడని 'యోగా' అని ప్రముఖ యోగాచార్యులు ప్రొఫెసర్ జి.సాంబశివరావు అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'యోగాతో ఆరోగ్యం, ఆనందం' అన్న అంశంపై శనివారం సభ జరిగింది. సభలో ప్రొఫెసర్ గుంటుపల్లి సాంబశివరావు మాట్లాడుతూ శారీరక, మానసిక దృఢత్వానికి పటిష్టమైన ఆరోగ్య ప్రక్రియ యోగా అని, భక్తి, కర్మ, రాజయోగాలతో పాటు అనేక యోగా ప్రక్రియలు రోగాలను నయం చేయడంతో పాటు మానసిక వికాసానికి, ప్రశాంత జీవన విధానానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం అందరూ ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు ఎన్.సదాశివమ్, కె. చంద్రశేఖర్ ప్రసంగించారు.

గుండె జబ్బులపై నేడు ఆరోగ్య సభ

ప్రజాశక్తి - గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని అవగాహన కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు గుండెపోటు, గుండె జబ్బులపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, తుళ్ళూరు మండలం, వడ్డమాను గ్రామ తాలూకు సర్వే నెం: 76/A రు, & సర్వే నెం: 85 ర్లు దాఖలా భూములు తాలూకు నా పేరున అమరావతి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, ద. నెం: 86/1973, ద.నెం: 32/1975, ద.నెం: 445/1975 ర్లుగా రిజిష్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజులున్నూ మరియు వడ్డమాను గ్రామ కంఠము 4 వార్డు నందు గల నివేశన స్థలము తాలూకు నా పేరున అమరావతి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1 వ పుస్తకం, ద.నెం: 167/1999 రుగా రిజిష్టరు కాబడిన ఒరిజినల్ దస్తావేజున్నూ మరియు మరికొన్ని యితర పత్రములను తీసుకొని బ్యాంకు పని నిమిత్తం ది 09-05-2025 వ తేదీన మా స్వగ్రామమైన వడ్డమాను గ్రామము నుండి తుళ్ళూరు గ్రామమునకు ద్విచక్ర వాహనముపై వచ్చు చుండగా పైన తెలిపిన నాలుగు ఒరిజినల్ దస్తావేజులు మార్గమధ్యములో ఎక్కడో జారి పడిపోయినవి. కనుక ద.నెం: 86/1973, ద.నెం: 32/1975, ద.నెం: 445/1975, ద.నెం: 167/1999 దస్తావేజులు ఎవ్వరికైనా దొరికినచో ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియపరచ గలరు.

ఇట్లు
మల్లాది శ్రీహరి రావు S/o వెంకయ్య (లేటు),
వడ్డమాను గ్రామం,తుళ్ళూరు మండలం,
గుంటూరు జిల్లా. ఫోన్ నెం. 94944 17345

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

మా క్లయింటు అయిన తెనాలి గాంధీనగర్ అడుసుమల్లి వారి వీధి, డోర్ నెం.2-38-2, ఫ్లాట్ నెం.501, రేణు అపార్ట్మెంట్ కాపురస్తురాలు ప్రస్తుతం హైదరాబాద్, మాదాపూర్ కాకతీయ హీల్స్ రోడ్డు నెం. 3లో నివాసం ఉంటున్న అడుసుమల్లి రితీష్ గారి కుమార్తె అయిన అడుసుమల్లి రేణు, లోగా అనగా మా క్లయింటు మైనర్‌గా ఉన్న సమయంలో గార్డియన్‌గా పెద తండ్రి అయిన అడుసుమల్లి వెంకటేశ్వరరావు గారు, పెమ్మసాని ఇందిరాదేవి మరియు అడుసుమల్లి రీతీష్ గారి ద్వారా ది.11-05-2007న విక్రయ దస్తావేజు డాక్యుమెంట్ నెం. 2985/2007 ద్వారా సంక్రమించిన స్థలము, మరియు రేణు అపార్ట్మెంట్, అడుసుమల్లి వారి వీధి, గాంధీనగర్, తెనాలి. రేణు అపార్ట్మెంట్ కట్టుబడి అగ్రిమెంట్ డాక్యుమెంట్ నెం. 2986/2007 ద్వారా సంక్రమించిన 2 ఒరిజినల్ దస్తావేజులు, నా క్లయింటు హైదరాబాద్ నుంచి తెనాలి వచ్చి తదుపరి కొత్తపేటలోని లాయర్ గారు వద్దకు వచ్చి తెనాలి టీబీ రోడ్డులోని జిరాక్సు సెంటర్కు వెళ్లి వచ్చు క్రమములో ఒరిజినల్ దస్తావేజులు కలిగిన కవర్ పోయినది. కావున ఎవరికైనా దొరికిన, తెలియ వచ్చినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తెనాలి
తేది : 24-05-2025

ఇట్లు
మందలపు వేణుగోపాలరావు
అడ్వకేట్, కొత్తపేట, తెనాలి
సెల్ : 98482 51024

దుక్కులతో ఖరీఫ్‌కు సిద్ధం

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

సాధారణంగా కొంత మంది రైతులు యాసంగి, వేసవి పంటలు కోసిన తర్వాత దుక్కిని దున్నకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటలకు తగిన మొత్తంలో పోషకాల లభ్యత అందదు. తద్వార రైతులు ఆశించిన పంట దిగుబడి పొందలేరు. దీని నివారణకుగాను వేసవిలోనే దుక్కులు దున్నుకోవడం ఎంతో ప్రయోజనకరమని వ్యవసాయాధికారులు చెపుతున్నారు.

పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం

లోతుగా దుక్కులు దున్నటం మేలు...

మరో రెండు నెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో మాచర్ల చుట్టుపక్కల గ్రామాల్లో కొందరు రైతులు తమ పొలాల్లో దుక్కులు దున్నుకుంటున్నారు. ఈ సమయంలో దుక్కి చేయటం వలన నేల స్థూల సాంద్రత దగ్గడం జరుగుతుంది. నేలలో గాలి ప్రసరించే గుణం పెరుగు తుంది. లోపలి పొరల్లో ఉన్న పోషకాలు నేల ఉపరితలానికి చేరి పంటకు లభ్యత పెరుగుతుంది. లోదుక్కుల ద్వారా వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూలంగా ఉండడంతో పాటు భూమి ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీని ప్రభావం తరువాత పంట దిగుబడిపై చూపుతోంది. పంట కోత అనంతరం పంట అవశేషాలు సేంద్రీయ కర్బనం అభివృద్ధి చెంది భూసారం అభివృద్ధి చెందుతుంది. దీని ద్వారా నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి తరువాత పంటకు వేసే ఎరువులు వినియోగ సామర్థ్యం పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది. వేసవిలో లోతుగా దుక్కులు దున్ని తొలకరి జల్లులు కురిసిన తర్వాత గొర్రు తిప్పి సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది.

సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, నాగలి వంటి పరికరాలు నేల లోపలికి 3 నుంచి 6 అంగుళాల వరకు చొచ్చుకునిపోతాయి. ఈ పరికరాలు తరచూ ఉపయోగించడం వల్ల నేల లోపల సుమారు 3 నుంచి 5 అంగుళాల లోతులో గట్టి పొర ఏర్పడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. వేసవి దుక్కుల సమయంలో నేలను లోతుగా దున్నినప్పుడు పొర ఛేదించబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది. తుంగ, గరిక వంటి మొండిజాతి కలుపు మొక్కలు పొలంలో అధికంగా పెరిగి పంటలను నాశనం చేస్తుంటాయి. కాని వేసవి దుక్కులు లోతుగా తీయడంతో పొలంలోని చీడలు నాశనమయ్యే అవకాశమున్నందున రైతులు, అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు కోరుతు న్నారు. పంట కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకుల వంటి వివిధ సేంద్రీయ పదార్థాలన్నీ లోతు దుక్కి దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోయి ఎరువు గా మారుతాయి. దీంతో నేలలో సేంద్రీయ పదార్థాలు, పోషక విలువలు పెరుగడానికి అవకాశం ఉంటుంది. లోదుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటే వర్షాకాలానికి అనుకూ లంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రెక్కల నాగలి, పల్లాల నాగలి, లోతు దుక్కు నాగలితో ప్రయోజనం

లోదుక్కులు కోసం రైతులు కొంతమంది కల్టివేటర్ వాడుతూ ఉంటారు. కల్టివేటర్ వల్ల కేవలం 10 నుంచి 12 సెంటి మీటర్ల లోతులో మాత్రమే ఇది దున్న గలదు. దాని కింద ఉండే నేలని దున్న లేదు. కాబట్టి కల్టివేటర్ బదులుగా రెక్కల నాగలి, పల్లాల నాగలి, గుణపము నాగలి లేదా లోదుక్కు నాగలి వాడి లోదుక్కులు దున్నితే నేలని ఇవి 30 నుంచి 75 సెంటీమీటర్ల వరకు అంటే ఒక అడుగు నుంచి రెండున్నర అడుగుల వరకు దున్నుతాయి. రెక్కల నాగలి 30 నుంచి 40 సెంటి మీటర్ల లోతు దున్నుతే, పల్లాల నాగలి రౌండ్ గా భూమిని చీల్చి 30 నుంచి 40 సెంటీమీటర్ల వరకు భూమిని దున్నుతుంది. దుక్కు నాగలి 60 నుంచి 75 సెంటీమీటర్ల లోతు వెళ్లి లోపల ఉన్న గట్టి పొరను చీల్చి గాలి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇలా దున్నటం ద్వారా లోపల పొరలో ఉన్న మట్టిని బయటకు తీసుకువచ్చి భూమిలో ఉన్న పోషక సమతుల్యతని కొత్త పంటకు అందిస్తుంది. వర్షపు నీటిని గ్రహించేలా చేస్తుంది. ఈ పరికరాలను వాడి లోదుక్కులు చేస్తే కొత్తగా వేయబోయే పంట దిగుబడిని పెంచవచ్చు.

మందలు పెట్టుకుంటే పొలానికి ఎంతో బలం ..

ఈ సమయంలో పొలాల్లో ఎలాంటి పంటలు ఉండవు. కాబట్టి రైతులు వేసవిలో తమ పొలాల్లో పశువులు, గొర్రెల మందలు పెట్టుకుంటే మంచిది. పశువులు, గొర్రెలను పొలంలో మందలు కట్టడం రైతులకు పాత విషయమే, కాబట్టి ఆ పని వేసవిలో చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పొలంలో మందలను కట్టిన సమయంలో మల, మూత్రాలు విసర్జిస్తాయి. దీంతో చేనుకు అవసరమైనంత ఎరువు లభించి పొలానికి అదనపు బలం చేకూరుతుంది.

అధిక దిగుబడులకు అవకాశం ..

దుక్కులను లోతుగా దున్నటం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయాధికారులు సూచనలు మేరకు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, తగిన సమయంలో పంటలు వేసి, సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించువచ్చునని వ్యవసాధికారులు చెపుతున్నారు.

చక్రారెడ్డిని సత్కరిస్తున్న సన్నిహితులు

వైసిపి రాష్ట్ర పంచాయితీ రాజ్ విభాగం జనరల్ సెక్రటరీగా చక్రారెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి ఇటీవల వైసిపి రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం జనరల్ సెక్రటరీగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయనను సన్నిహితులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌గా చక్రారెడ్డి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. మండలంలో వైసిపి విస్తరణకు ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. సౌమ్యుడు, మృధు స్వభావి అయిన చక్రారెడ్డికి ఈ పదవి రావడానికి దోహదపడిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చక్రారెడ్డిని దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైతు మృతి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

బాబు నాయక్ (ఫైల్ ఫొటో)

ప్రమాదవశాత్తు నాగార్జున సాగర్ కుడి కాలువలో పడి రైతు మతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మాచర్ల మండలం బ్రహ్మానందపురం తండా గ్రామానికి చెందిన కరంటోత్ బాబు నాయక్ (55) తన పొలంలో నీరు పెట్టేందుకు సాగర్ కుడి కాలువ బయ్యారం వద్ద మోటార్ వద్దకు వెళ్ళాడు. మోటార్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి సాగర్ కుడికాలువలోకి పడి పోయా డు. సమాచారం అందుకున్న మాచర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్, విజయపురిసౌత్ ఎస్ఐ షేక్‌షఫీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాబునాయక్ మృతదేహన్ని వెలికితీసి పోస్ట్ మార్టంకు తరలించారు. మృతుడి కుమారుడు లచ్చిరాం నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షఫీ తెలిపారు.

అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

ఎస్‌సి, ఎస్‌టిల ప్రత్యేక స్పందనకు 32 అర్జీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రతి నెల 4వ శనివారం ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలకు సంబంధించిన 32 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాలికలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాలికలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఉన్నత విద్యనభ్యసించి తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామం, నడికుడి-3 సచివాలయంలో జరిగిన కిషోరి వికాసం సమ్మర్ క్యాంప్, సెషన్-7 కార్యక్రమంలో విద్య, ఓపెన్‌స్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. కిషోరి బాలికలకు విద్య ప్రాముఖ్యతపై ఆమె మాట్లాడుతూ బాలికలు చైతన్యంతో మెలగాలనీ, ఎటువంటి ప్రలోభాలకు లొంగకూడదని, జీవితంలో ధైర్యంగా ఉండాలని చెప్పారు. బాల్య వివాహం చేసుకోకూడదని, ఆర్థిక స్తోమత లేని వారికి హాస్టల్ సౌకర్యాలు ఉన్నా యన్నారు. ఐసిడిఎస్ పిడి ఉమాదేవి, డిసిపిఓ శౌరిరాజు కిషోరి బాలికల రక్తహీనతకు గురికాకుండా పోషకాహారం తీసుకోవాలని, అక్రమ రవాణకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని బాలల హక్కుల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో దాచేపల్లి మున్సిపల్ కమిషనర్ ఎంవి అప్పారావు, ఎంపిడిఓ రవికుమార్, ఆర్ఐ శరత్, గురజాల ఐసిడిఎస్ ప్రాజెక్టు ఇంచార్జ్ సిడిపిఓ అరుణ, ఎసిడిపిఓ నిర్మల, నడికుడి సెక్టార్ సూపర్వైజర్ వరలక్ష్మి, ఎంఎస్‌కె రత్నం పాల్గొన్నారు.

అనంతరం పిడుగురాళ్ల బాలికా సదన్‌లో రికార్డులు పరిశీలించి తగు సూచనలు చేశారు. పిల్లలకి అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. దత్తతకు ఉన్న పిల్లలను త్వరతగతిన అడాప్షన్ ప్రాసెస్లో పెట్టాలని ఆదేశించారు. బాలికా సదన్లో ఉన్న బాలికలకు కేసుస్టడీ రిపోర్ట్, ఇండివిడ్యుల్ కేర్ ప్లాన్స్, హెల్త్ రికార్డ్స్, బాలల న్యాయ(ఆదరణ, రక్షణ) చట్టం -2015 మరియు బాలల న్యాయ(ఆదరణ,రక్షణ), 2016-2023 నిబంధనలు అనుసరించి ఉండాలన్నారు. బాలలకు అధార్, జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి ఇప్పించాలన్నారు. ఆయా కార్యక్రమాలలో సిడిపిఓలు, ఐసిడిస్ సూపర్వైజర్లు బాలిక సదన్ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగంలోకి మీ-సేవా కేంద్రం

రూ.2 లక్షలతో మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-మాచర్ల

ఐదేళ్ళుగా నిరూపయోగంలో వున్న పట్టణంలోని మీ-సేవా కేంద్రం భవనానికి మున్సిపాలిటి వారు మరమ్మతులు చేసి సిద్ధం చేస్తున్నారు. ఈనెల 12వ తేదీన "నిరూపయోగంగా మీ-సేవా కేంద్రం భవనం" శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు భవనానికి మరమ్మత్తులు చేపట్టారు. ఈ విషయమై మన్సిపల్ కమిషనర్ వేణుబాబు మాట్లాడుతూ రూ. 2 లక్షల వ్యయంతో మరమ్మత్తులు చేపట్టి, పడిపోయిన ప్రహరిగోడ నిర్మాణం, బాత్‌రూం పనులు చేపట్టి, భవనానికి నూతన రంగులు వేశారు. పూర్తిస్థాయిలో సిద్ధం చేసిన మీ-సేవా కేంద్రం భవనాన్ని మహిళలకు కుట్టు మిషన్‌పై శిక్షణనిచ్చే శిక్షణాకేంద్రంగా వినియోగిస్తామని తెలిపారు. ఓబిసి, బిసి మహిళల స్వయంఉపాధి కొరకు కార్పోరేషన్ ద్వారా కుట్టు మిషన్‌పై శిక్షణ ఇచ్చి, మిషన్లు ఉచితంగా అందిస్తామన్నారు. కుట్టుమిషన్‌పై శిక్షణ పొందేందుకు ఇప్పటికే 380 మంది మహిళలు తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. మహిళలకు శిక్షణ పూర్తి అయిన తరువాత ఈ భవవనాన్ని ఖాళీగా ఉంచకుండా దగ్గర్లోని వార్డు సచివాలయాన్ని ఇక్కడికి షిఫ్ట్ చేస్తామన్నారు. ఐదేళ్ళు నిరూపయోగంగా ఉండి, శిథిలమవుతున్న భవనానికి మరమ్మత్తులచేసి వినియోగంలోకి తెస్తున్న మున్సిపల్ అధికారులను స్థానికులు అభినందిస్తున్నారు.

మరమ్మతు చేపట్టి సిద్ధం చేసిన మీ-సేవా కేంద్రం

మీజిల్స్, రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రత్యేక శిబిరాలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ ఆదేశాల మేరకు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీజిల్స్ రూబెల్లా ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లాలో మూడు విడతలుగా వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. మొదటి విడతగా మే 26 నుండి 31 వరకు, రెండవ విడతగా జూన్ 23 నుండి 28 వరకు, మూడో విడతగా జూలై 21 నుండి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఎంఆర్ వ్యాక్సినేషన్ మొదటి డోసును 9 నుండి 12 నెలల మధ్య, రెండవ డోసును 16 నెలల నుండి 24 నెలల మధ్య పిల్లలకు వేయడం జరుగుతుందని, ఈవ్యాక్సిన్ వేయడం పిల్లలకు ఆటలమ్మ, రూబెల్లా వ్యాధులు రాకుండా నివారించవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అంగన్వాడి కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఎంఆర్ వ్యాక్సిన్ వేయని పిల్లలకు తల్లిదండ్రులు ప్రత్యేక శిబిరాల్లో వ్యాక్సిన్ వేయించాలని జిల్లా టీకాల అధికారిణి డాక్టర్ బి.గీతాంజలి కోరారు.

రీ వెరిఫికేషన్‌లో పెరిగిన మార్కుల శాతం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఎస్ సుమశ్రీ

10 తరగతి పరీక్ష రీవెరిఫికేషన్ ఫలితాలలో శ్రీ వివేకా నంద విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థి ఎస్ సుమశ్రీ పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో అత్యధికంగా 591/600లి మార్కులు సాధించి మొదటి స్థానం కైవసం చేసుకుంది. సుమశ్రీని స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి. దుర్గా ప్రసాద్, స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.శిరీష మాట్లాడుతూ ఒత్తిడిలేని వాతావరణంలో, విలువలతో కూడిన విద్యతో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, క్రమ శిక్షణ సరైన విద్యా ప్రణాళికతో ఈ ఫలితాలు సాధ్యం అయిందన్నారు. శిరీషను ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారు.

వర్షపు నీరు పోయే దారేది?

కుంచనపల్లిలో వర్షపు నీరు నిలిచి పల్లంగా మారిన సిసి రోడ్లు

▸ ఇబ్బందులు పడుతున్న ప్రజలు ▸ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎప్పుడు వర్షం కురిసినా ఆ రోడ్డులో వర్షపు నీళ్లు రోజుల తరబడి నిలవాల్సిందే. పేరుకే సిసి రోడ్లు. గ్రామమంతా ఎక్కడి వర్షపు నీరు అక్కడే నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ళ లోతు నీళ్లలో కాళ్లు ఈడ్చుకుంటూ వస్తున్నా గ్రామ సచివాలయ అధికారులు ఎవరు పట్టించుకోరు. ఎప్పుడు పడితే అప్పుడు అకాల వర్షాలు కురుస్తూ రోడ్లపై నాచు పట్టి రోడ్లు ఛిద్రమవుతున్నా గ్రామంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆ రోడ్డు వైపు నుండి ప్రయాణం చేస్తున్నారే కానీ ప్రజల ఇబ్బందులను గమనించడం లేదు. ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామం భూముల విలువ అమాంతంగా పెరిగి, బహుళ అంతస్తుల భవనాలు ఫౌండేషన్ పెంచి మరీ కట్టుకున్న మురుగునీరు పోయేదారి లేక, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టక దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, కౌలు రైతులు అధికంగా ఉన్న గ్రామంలో ఇంటి పన్నుల రూపంలో సచివాలయానికి ఆదాయం వస్తున్న పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. గ్రామంలోని ప్రధాన రహదారి సిసి రోడ్లు వేసిన, నివాస ప్రాంతాల బిల్డింగులు రోడ్డుకి మూడు అడుగుల ఎత్తులో ఉండడం సిసి రోడ్లు పల్లంగా మారి, అధిక వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో రోజుల తరబడి రోడ్లపై నిలిచి ఉంటుంది. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు గ్రామంలో వార్డు మెంబర్లు తమ రోడ్లు పల్లంగా మారాయని గ్రామ పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్ తో రోడ్లు వేసేందుకు తీర్మానం చేసుకొని కొత్తగా రోడ్లు నిర్మించుకునేవారు. గ్రామపంచాయతీ కాస్త మున్సిపాలిటీలో, కార్పొరేషన్‌లో విలీనం అయిన తర్వాత రోడ్లను, డ్రైనేజీ కాలువల నిర్మాణం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పదుల సంఖ్యలో స్కూల్ బస్సులు, కాలేజ్ బస్సులు ప్రయాణం చేస్తున్న, బస్సు ఎక్కేందుకు విద్యార్థినీ, విద్యార్థులు నానా తంటాలు పడాల్సి వస్తుంది. గ్రామంలో డ్రైనేజీలు ఉన్న కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీలు పొంగి, వర్షపు నీరులో కలిసి దుర్గంధం వెదజల్లుతూ, దోమలు అధికంగా ప్రబలుతున్నాయి. ఆ రోడ్డు వైపు ప్రయాణం చేసే చిన్నారులు కాలుజారి గాయాల పాలైన పరిస్థితి కూడా దాపరించింది. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన కుంచనపల్లి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడం నివాస ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య కార్మికుల సైతం వర్షం వస్తే, తమ బాధలు వర్ణనాతీతం అని సనుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టి, పల్లంగా మారిన సీసీ రోడ్లను ఎత్తు పెంచి, గ్రామాన్ని పరిశుభ్రం చేసేందుకు పూనుకోవాల పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

చిన్నపాటి వర్షానికే ఇంటి ముందు నీరు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఇళ్ల ముందు నిలబడిన నీరు

శనివారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికే పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వెనుక, నులకపేట, డ్రైవర్ కాలనీలో ఇళ్ల ముందుకు వర్షపు నీరు వచ్చి చేరింది. రోడ్లు వర్షపు నీటితో మునిగిపోయాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా తమకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరి, తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని బాధితులు కోరుతున్నారు.

ఉగ్రవాదం అణచివేతకు భారతీయులందరూ ఐక్యంగా నిలబడ్డారు : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు

ఉగ్రవాదాన్ని అణచివేసే దానికోసం దేశవ్యాప్తంగా భారతీయులందరూ కులమతాలకు అతీతంగా ఐక్యంగా నిలబడ్డారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు అన్నారు. దేశ సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకుందామని యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆత్మకూరు గ్రామంలో సమైక్యత సదస్సు శనివారం జరిగింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన అప్పారావు మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు ప్రజలపై అమానుషంగా దాడి చేసి 26 మందిని బలిగొన్నారని, ఉగ్రవాదాన్ని అణచివేసే దానికోసం దేశవ్యాప్తంగా భారతీయులందరూ కులమతాలకు అతీతంగా ఐక్యంగా నిలబడ్డారని తెలిపారు. ఉగ్రవాదులు దేశంలో మతకలహాలు సృష్టించే దానికోసం ప్రయత్నం చేస్తే దానిలో మనదేశంలోని కొందరు సోషల్ మీడియాలోను వారి చర్యలకు చేయూతనిచ్చే విధంగా వ్యవహరించారని ఉగ్రవాదానికి మతం లేదని కాశ్మీరులో జరిగిన దాడి మతాల మధ్య జరిగింది కాదని భారతీయుల మీద జరిగిన దాడి అని తెలిపారు. ఉగ్రవాదాన్ని అనిసివేసే దానికోసం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. గత నెల రోజుల క్రితం కాల్పుల విరమణ జరిగిన తర్వాత దేశ సార్వభౌమాధికారం ప్రమాదంలో పడినట్లుగా కనబడుతుందని అమెరికా అధ్యక్షుడు మధ్యవర్తిత్వం తోటి ముందుగా కాల్పుల విరమణ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడం సరైంది కాదని, దీనిపై ప్రధాని ఇంతవరకు మాట్లాడకపోవడం కరెక్ట్ కాదని తెలిపారు .అలాగే యుద్ధంలో దేశానికి సేవలందించిన కల్నల్ సోఫియా ఖురేషిపై అవమానించే విధంగా బిజెపి అనుకూల సోషల్ మీడియాలో అసభ్యకరమైన ట్రోలింగ్ జరిగిందని, అలాగే మధ్యప్రదేశ్ మంత్రి విజయసా ఉగ్రవాదుల సోదరి అని అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని దీనిని జాతీయమహిళా కమిషన్, సుప్రీంకోర్టు సైతం ఖండించాయని వారిపై చర్య తీసుకోవాలని చెప్పినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు .ఇటువంటి అనుచిత వ్యాఖ్యలు భారత సైన్యం యొక్క పోరాటపటి మను దెబ్బతిస్తాయని తెలిపారు .అలాగే దేశంలో పహాల్గంలో ఉగ్రవాద దాడులు చూస్తుంటే భద్రత వైఫల్యం కనబడుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉగ్రవాద దాడి అనంతరం జరిగిన పరిణామాలపై పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు చెప్పవలసిన అవసరం ఉందని తెలిపారు. మన దేశాన్ని మతాలకు అతీతంగా సమైక్యంగా నిలబెట్టుకోవడమే దేశ అభివఅద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ సదస్సులో సిపిఎం పార్టీ మంగళగిరి రూరల్ మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు ప్రసంగించారు. ఈ సదస్సుకు బిట్రా రాంబాబు అధ్యక్షుత వహించారు. సీతారామయ్య, జి. లక్ష్మి తదితరులు ప్రసంగించారు.

మాట్లాడుతున్న సమీర్ కుమార్

బాల్య వివాహాలను నిరోధించాలి

ప్రజాశక్తి - తెనాలి

బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని, వివాహ వయసును కచ్చితంగా పాటించాలని చైల్డ్ రైట్స్ అడ్వొకసి ఫోరం(సిఆర్ఎఎఫ్) జిల్లా సమన్వయకర్త కె సమీర్ కుమార్ చెప్పారు. సిఆర్ఎఎఫ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయిలో బాల్య వివాహాలు నియంత్రణ, బాల కార్మిక చట్టాల అమలు, ఫోక్సో చట్టంపై మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమీర్ కుమార్ మాట్లాడుతూ స్త్రీలకు 18, పురుషులకు 21 సంవత్సరాలు వివాహ వయసును పాటించాలన్నారు. అతిక్రమించి వివాహాలు జరిపిస్తే చట్టపరంగా జైలు శిక్ష, జరిమానాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఐసిడిసి సూపర్వైజర్లు కె.సౌజన్య,సిహెచ్.హిమ బిందు, కె .యనదమ్మ, వై. నాగమణి, టి. రాధిక, వెంకటరమణమ్మ, మహిళా పోలీసులు, సిఎస్డబ్ల్యూ షేక్. పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన : కమిషనర్

ప్రజాశక్తి - గుంటూరు

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ కోవెలమూడి

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో రూ.3.15 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించడానికి శంకుస్తాపన చేసినట్లు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 54, 56 డివిజన్లలో రూ.2.43 కోట్లతో, పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్లో రూ.72.20 లక్షలతో సి.సి.రోడ్లు, సి.సి. డ్రెయిన్లు, తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయటానికి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ మహ్మద్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ప్రజావసరాల దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎమ్మెల్యేలు పలు అభివృద్ధి పనులు చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి వర్షపు నీరు నిలుస్తూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సదరు కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, అయిశెట్టి కనకదుర్గ, మల్లవరపు రమ్య, ఈరంటి వరప్రసాద్, ఈఈ సుందర్రామిరెడ్డి, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు దాసరి రాజామాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

172వ రోజుకు చేరిన ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు చట్ట ప్రకారం రావలసిన బకాయిలు కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 172వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో డి. నాగేశ్వరరావు, డి.భరత్, జి.కొండయ్య, కె.విజయ మోహన్ రావు, సిహెచ్. పిచ్చయ్య కూర్చున్నారు. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.గురవయ్య, ఎం.ఆశీర్వాదం, ఎస్.కె. ఇస్మాయిల్, టి.దుర్గా భవాని, టి.నాగేశ్వరరావు, దర్శి మాణిక్యాలరావు, షేక్ జానీ, వి.లక్ష్మి, రమణమ్మ, ఎం.శివమ్మ, హిమాంబి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సయ్యద్ జియావుద్దీన్

పిల్లల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

అంతర్జాతీయ తప్పి పోయిన బాలల దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటురులో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పిల్లలు తప్పిపోవడం తల్లిదండ్రులకు తీరని కడుపుకోతను, సమాజానికి పెద్ద సవాలుని మిగిలిచ్చిందని అన్నారు. ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో పిల్లలు కనిపించకుండా పోతున్నారని, వారిలో కొంతమంది తిరిగి వచ్చినా చాల మంది జాడ తెలియట్లేదన్నారు. అధికారిక గణాంకాల ప్రకారం గత మూడు సంవత్సరాలలో 10వేల మందికిపైగా తప్పి పోయిన కేసులు నమోదు అయ్యాయన్నారు. 2022లో 83,350 మంది చిన్నారులలో 62,946 మంది బాలికలు ఉన్నారని, ప్రతి నలుగురు మిస్ అయిన పిల్లలలో ముగ్గురు బాలికలున్నారని తెలిపారు. పిల్లలను సురక్షితంగా ఉంచే బాధ్యత తల్లి తండ్రులదే కాక సమాజంలో పౌరులుగా మనందరి బాధ్యత అని తెలిపారు. ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు మాట్లాడుతూ ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసీజర్ పోలీస్ యూనిట్ ఎలా పనిచేస్తుంది పిల్లలు తప్పిపోతే ఎఫ్.ఐ.ఆర్ ఎలా నమోదు చేయాలో పిల్లలు ట్రేస్ కాకపోతే ఆ కేసును సి.ఐ.డి కి ఎలా ట్రాన్స్ఫర్ చేయాలో తగు పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయత్ అధికారి సాయికుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ్ కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీహనుమాన్ సాయి తప్పిపోయిన పిల్లలను కలయాపన లేకుండా ఎలా గుర్తించగలమో వివరించారు. ఈ కార్యక్రమలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు , ప్యానల్ అడ్వకేట్‌లు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరికి దుండగుల విఫల యత్నం

ప్రజాశక్తి - తెనాలి

ఏటీఎంను పగలగొట్టి నగదు అపహరించేందుకు దుండగులు విఫలయత్నం చేశారు. స్థానిక శివాజీ చౌక్ నుంచి కొత్తపేట వెళ్లే రోడ్డులో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం షట్టర్ ను శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు పగలగొట్టారు. ఏటీఎంను పగులగొట్టే సమయంలో అలారం శబ్దం రావడంతో దుండగులు ఉడాయించారు. విషయం తెలుసుకున్న పట్టణ వన్ టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

వస్త్ర, అన్నదానం చేస్తున్న వెంకటరామయ్య కుటుంబ సభ్యులు

దివ్యాంగులకు వస్త్ర, అన్నదానం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యనమదల వెంకటరామయ్య సతీమణి స్వర్గీయ అనిత నాలుగవ వర్ధంతి సందర్భంగా దివ్యాంగులకు వస్త్ర, అన్నదానం కార్యక్రమం శనివారం కృష్ణవేణి కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ స్వర్గీయ అనిత జ్ఞాపకార్థం ఆమె పేరున ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ దివ్యాంగులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు పాషావలి, ఆవుల ఆంజనేయులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి - వినుకొండ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పుట్టారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టి భవిష్యత్తు తరాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందర్ రెడ్డి ఏవో వెంకటరవి స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ పచ్చిగోళ్ళ ప్రభాకర్‌రావు ఏపిఓ కట్ట నాగేశ్వరరావు నడిగడ్డ మాజీ సర్పంచి గోవిందరాజులు వీరాంజనేయులు వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జంట హత్యలు పోలీసు నిఘా వ్యవస్థకు చెంపపెట్టు : ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - వెల్దుర్తి

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మండల పరిధిలో జరిగిన జంట హత్యలు పోలీసు నిఘా వ్యవస్థకు చెంపపెట్టు లాంటిదని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని గుండ్లపాడుకు చెందిన టిడిపి నాయకులు, అన్నదమ్ము లైన జువిశెట్టి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావులను మండాది, బోదల వీడు మార్గం మధ్యలో ప్రత్యర్థి వర్గం కారుతో గుద్ది హత్య చేశారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం పోలీసులు చర్య తీసుకొని ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని సూచించారు. మీడియాతో మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో రాక్షసత్వం రాజ్యం మేలుతోందని, అందుకు నిదర్శనమే పోలింగ్ ముందు, పోలింగ్ రోజు ప్రజలందరూ చూశారని తెలిపారు. మాచర్లలో శాంతి భద్రత లకు విఘాతం కలిగితే ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారు తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసు వ్యవస్థలో కచ్చితంగా ప్రక్షాళన జరగాలి..!

అత్యంత సమస్యాత్మకమైన గుండ్లపాడులో శాంతిని నెలకొల్పేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామనీ, పోలీసు నిఘా వ్యవస్థ నిర్లక్ష్యం వహిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి వాపోయారు. నియోజకవర్గ పరిధిలో లాఅండ్ ఆర్డర్‌ను అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హత్యల్లో పిన్నెల్లి సోదరుల పాత్ర..!

గుండ్లపాడు టిడిపి కార్యకర్తల జంట హత్యల్లో పిన్నెల్లి సోద రుల పాత్ర ఉందని ఎమ్మెల్యే జూలకంటి పేర్కొన్నారు. వర్గపోరు రెచ్చకొట్టి హత్యలకు దారి తీసేలా వ్యూహరచన చేయడంలో పిన్నెల్లి సోదరుల పాత్ర ఉంది ఆరోపించారు. హత్య రాజకీయాల సంస్కృతిని సమూలంగా రూపుమాపేందుకు ప్రయ త్నాలు చేస్తుంటే, నియోజకవర్గంలో అశాంతిని పురికొల్పేలా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేయండి

అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యోగాంధ్రలో ప్రజలను భాగ స్వామ్యం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. యోగా ంధ్ర కార్యక్రమంపై జిల్లా, మండల స్థాయి అధికారులతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వచ్చే నెల 21 వరకు యోగా ప్రాముఖ్యతను విస్తృత ప్రచారం ద్వారా ప్రజలకు చైతన్యం కలిగించాలన్నారు. యోగా ప్రాముఖ్యతను తెలిపేలా విద్యార్థులకు ఆయా రంగాల వారికి వివిధ పోటీలను నిర్వహించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. యోగాడేలో నమోదు చేసుకునేందుకు రూపొందించిన యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. రోజూ నరసరావు పేటతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో మండల స్థాయిలో యోగా ప్రాముఖ్యత ప్రతి ఒక్కరికి తెలిసేలా కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపి డిఓలను ఆదేశించారు. జిల్లాలో పర్యాటక సంబంధిత ప్రదేశాల్లో యోగా ప్రాము ఖ్యతపై కార్యక్రమాలు నిర్వహించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఎంపిడిఓ లు, పర్యాటకశాఖ అధికారుల సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. టెలికాన్ఫ రెన్స్‌లో డిఆర్‌ఓ ఏకా మురళి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం

కేసుల పరిష్కారంలో ప్రతిభ చాటిన సిబ్బందికి సత్కారం

పెండింగ్ కేసులు సకాలంలో పూర్తి చేయాలని ఎస్‌పి సూచన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా ఎస్‌పి కంచి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం జరిగింది. ఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, నేర నియంత్రణను ప్రథమ కర్తవ్యంగా పోలీసు సిబ్బంది నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను హేతుబద్ధంగా విశ్లేషించి తగ్గించాలని, పోలీస్ స్టేషన్‌లో బాధితులతో మర్యాదపూర్వకంగా, సున్నితమైన భాషలో మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విని న్యాయం జరిగిస్తామన్న నమ్మకం కల్పించాలని సూచించారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, వీటి విచారణలో మహిళా పోలీసు సిబ్బంది తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలో పరిష్కరించి, డాక్యుమెంట్లను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, పోక్సో కేసులు, మహిళలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ అవగాహన సదస్సులు, వేగనియంత్రణ సైన్ బోర్డులు, స్టాప్ బోర్డులు ఏర్పాటు

సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్‌పి కె.శ్రీనివాసరావు

చేయాలని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, గంజాయి అక్రమ రవాణా, నాటుసారా తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. 112 ఎమర్జెన్సీ కాల్స్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నరసరావుపేట, ముప్పాళ్ళ, చిలకలూరిపేట, ఈపూరు పోలీస్ స్టేషన్ల లోని 5 కేసులలో నిందితులకు జీవిత ఖైదు, మరణ శిక్ష విధించడంలో కృషి చేసిన సిబ్బందిని సన్మానించి, మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అదనపు ఎస్‌పి జె.వి.సంతోష్, డిఎస్‌పిలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంత రావు,ఆర్‌ఐలు,సిఐలు,ఎస్‌ఐలు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి

ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి - వినుకొండ

చత్తీస్గడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాల్ని ఏపీ హైకోర్టు కుటుంబ సభ్యులకి ఇవ్వాలని ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలి, వారితో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం మధ్యాహ్నం ఏనుగుపాలెం రోడ్‌లో ఉన్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన చత్తీస్ గడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారని కేంద్ర హెూం మంత్రి ప్రకటించారు. ఆ మృత దేహాలను బంధువులకు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకున్నాయని తెలిపారు. ఏపీ హైకోర్టులో వారి కుటుంబ సభ్యులు రిట్ మూవ్ చేయడంతో వారి రక్తసంబంధీకులకు మృతదేహాలని ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారని పేర్కొన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని కాల్పుల విరమణ ప్రకటించిన మావోయిస్టు అగ్ర నాయకుడు సంబాల కేశవరావు,(జంగు) పత్రిక ఏడిటర్ సజ్జ నాగేశ్వరరావును కేంద్ర రాష్ట్ర బలగాలు కాల్చి చంపటం సరైంది కాదని వారితో చర్చలు జరిపి వారు ప్రతిపాదిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించాలింది పోయి కాల్చి చంపటం సరైన విధానం కాదని తెలిపారు. దీనికి ముగింపు పలకాలని, శాంతి చర్చలే పరిష్కారమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎమ్ ఎల్ లిబరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు, ఎస్ కే ఫిరోజ్, కామా వెంకటేశ్వర్లు, ప్రసాదు, పిడిఎమ్ రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, ప్రసాదు, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిన్న, బీసీ నాయకులు బత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

66వ రోజుకు మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నెల రోజుల పాటు పూర్తిగా పని చేస్తే 10 నుండి 15 రోజులకు వేతనాలు ఇస్తే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని చేసినన్ని రోజులకు వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు కోరుతూ ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 66వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ ఆప్కాస్‌లో నమోదైన కార్మికుల పట్ల వివక్ష ఎందుకని ప్రశ్నించారు. నెల మొత్తం పని చేసినా పూర్తి వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదని, అరకొర వేతనాలతో కార్మికుల

సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

కుటుంబాలు ఎలా గడవాలని మున్సిపల్ అధికా రులను ప్రశ్నించారు. 6 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న 40 మంది కార్మికులకు పని చేసిన అన్ని దినాలకు వేతనాలు ఇవ్వడం లేదని, మిగతా కార్మికులతో పాటు 8 గంటలు పని చేస్తున్నా ఔట్ సోర్సింగ్ కార్మికులతో పాటు వీరి పేర్లు ఏపి ఔట్సోర్సింగ్ కార్పొరేషన్లో నమోదైనా వివక్ష తగదన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

డ్రగ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి-ఈపూరు

డ్రగ్స్, మాదకద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మద్యపానం, నాటు సారాయి, గంజాయి, డ్రగ్స్ దుష్ఫలితాలపై కేర్ కార్యక్రమం ద్వారా శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా సంఘీభావాన్ని తెలిపారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు.

పవన్ కుమార్, డాక్టర్ కృష్ణదాసు పర్యవేక్షణలో

నేడు ఉచిత కంటి వైద్య పరీశిబిరం

ప్రజాశక్తి - మాచర్ల

కృష్ణవేణి, ఎస్‌వీఆర్ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో శ్రీధరి యం ఆయుర్వేదిక్ ఐక్లినిక్, పంచకర్మ సెంటర్ ప్రైవేట్ లిమి టెడ్ వారు ఆదివారం పట్టణంలోని ఎస్వీఆర్ డిగ్రీ కాలేజిలో ఉచిత కంటి, ఇతర సమస్యల ఉచిత పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. బ్రాంచి ఇన్‌చార్జి పవన్ కుమార్, డాక్టర్ కృష్ణదాసు పర్యవేక్షణలో కంటి మచ్చల క్షీణత, ఆప్టిక్ న్యూరోపతి, కంటి నీటి కాసులు, దూరదృష్టి లోపం, నిరంతర పొడి కన్నులు, కండ్లకలక, కీళ్ళవాతం, వెన్నెముక, జ్ఞాపకశక్తి సమస్యలు, వెన్ను, నరాలనొప్పి, ఉబ్బిన నరాలు సమస్యలు ఉన్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. సమస్యలు ఉన్న వారు పట్ట ణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా వున్న ఎస్వీఆర్ డిగ్రీ కాలేజికి ఉదయం10గంటలకు చేరుకోవాలని నిర్వాహకులు కోరారు. మరింత సమాచారం కొరకు 7034020977, 7034020877 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దస్తగిరిని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

మండల టిడిపి మాజీ అధ్యక్షుడు దస్తగిరికి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు మండల మాజీ టిడిపి అధ్యక్షులు షేక్ దస్తగిరి శుక్రవారం పలువురు టిడిపి నాయకులు పరామర్శించారు. దస్తగిరి వృద్ధాప్య సంబంధమైన బాధతో కొద్దికాలంగా అస్వస్థతగా ఉన్నారు. నియోజకవర్గ టిడిపి నాయకులు కంచేటి సాయిబాబు హసనాబాదులోని దస్తగిరి గృహానికి వెళ్లి పరామర్శించారు. దస్తగిరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దస్తగిరి ఆరోగ్యం మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలను ఆయన కుమారుడు షేక్ బడాను విచారించారు. దస్తగిరి మండల టిడిపి అధ్యక్షుడిగా పని చేసిన రోజుల్లో పార్టీ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమా లను ఈ సందర్భంగా చర్చించారు. తెలుగుదేశం పార్టీ మహానాడు జరుగుతున్న విషయాన్ని తెలియ జేశారు. దస్తగిరిని పరామర్శించిన వారిలో మండల టిడిపి అధ్యక్షులు గుడిపాడు బాషా, మండల పరిషత్, ఉపాధ్యక్షులు గాదె సూరయ్య, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నలజాల సదా ఉన్నారు.

చెక్కులను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. కొప్పురావుకాలనీకి చెందిన గుంటి శివనాగేశ్వరరావుకు రూ.1,04,650 /- ఎన్‌సిసి రోడ్డుకు చెందిన మసానం లక్ష్మి కాంతంకు రూ. 42,200/- భగత్ సింగ్ నగర్‌కు చెందిన షేక్ ముబీనాకు రూ. 60,000 వేల విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర పద్మశాలీయ సాధికార సమితి కార్యవర్గ సభ్యులు ఊట్ల శ్రీమన్నారాయణ, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మాజీద్, గుంటూరు పార్లమెంటరీ సాధికార సమితి సగర కన్వీనర్ పందేటి తిరుపతయ్య, 24వ వార్డు అధ్యక్షులు గంజి చంద్రశేఖర రావు, మాచర్ల శ్రీనివాసరావు, గుంటి నాగరాజు, మండ్రు రాంబాబు, వెలుగోటి అన్నపూర్ణ, ఆకురాతి జయలక్ష్మి, రాయపాటి విజయ్, బూదాటి శ్రీనివాసరావు, కొల్లి శ్రీనివాస్, ఇండ్ల రజని, గంజి శివసుధ, పొదిలి హరిబాబు, కేసనం సాయి భావన తదితరులు పాల్గొన్నారు.

నేడు సహకార భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- తాడేపల్లి

ఆదివారం ఉదయం తాడేపల్లి సుందరయ్య నగర్ లోని లీలా సుందరయ్య కళావేదిక వద్ద సహకార భవనం శంకుస్థాపన జరుగుతుందనిసహకార భవనం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలోని వినియోగదారులకు కార్మికులకు మధ్య అనుసంధానంగా కార్మిక వినియోగదారుల సహకార సంఘం ఏర్పాటు నిర్వాహకులు తెలిపారు.

వ్యర్థాలను సక్రమంగా తొలగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో హోల్‌సేల్ మార్కెట్లలో ఆశీల వసూళ్ళకు టెండర్ పొందిన వారు నిర్దేశిత ప్రాంతంలోనే ఆసీలు వసూళ్లు చేయడంతో పాటు ఆయా ప్రాంతాలలో వ్యర్థాలను కూడా వారే తొలగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి బండ్ల బజార్ హోల్ సేల్ ఫ్రూట్ మార్కెట్, లాలాపేట, పట్నంబజార్, ఆదర్శ్ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అందిన పిర్యాదులను నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలన్నారు. పట్నం బజారులో ప్రతిరోజు క్వింటాళ్ల కొద్దీ వ్యర్థాలు వస్తు న్నాయని, వాటిని సరైన పద్ధతిలో తొలగించకపోవడం వలన స్థానికంగా తీవ్ర సమస్యలు తలెత్తుతున్నా యన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య మెరుగుదలకు గత కొంతకాలంగా ప్రత్యేక కృషి చేస్తున్నట్లు చెప్పారు. వ్యాపారస్తులు కూడా వ్యర్థాలను రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్‌లను ఉపయోగించుకోవాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్లు మహమ్మద్ చిష్టి, ఈరంటి వరప్రసాద్, సిఎంహెచ్ఒ డాక్టర్ అమతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పట్నంబజారులో స్థానికులతో మాట్లాడుతున్న మేయర్, కమిషనర్

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి టీడీపీ కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో అమరావతి కంటి ఆసుపత్రి విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం నిర్వహించారు.ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషా స్పందన లభించిందని అన్నారు. కంప్యూటర్ పై సూపర్ నిర్ధారణ పరీక్షలు, షుగరు బీపీ ఉన్నవారికి కంటికి రెటీనా పరీక్షలు చేయడం జరిగిందని చెప్పారు. తాడేపల్లిలోని పలు ప్రాంతాల నుంచి 172 మందికి కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 37 మందికి శుక్లం ఆపరేషన్లు 5 మందికి పోరా ఆపరేషన్లు, 26 మందికి కళ్ళజోళ్ళు అవసరమైనట్లు డాక్టర్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, టీడీపీ నాయకులు గొర్ల వేణుగోపాల్‌రెడ్డి, అద్దంకి మురళి, మండవ గోపాలరావు, కేళి వెంకటేశ్వరరావు, మేకా పుల్లారెడ్డి, కోర్రపాటి విజయ్ కుమార్,భాస్కర్ రావు,జి.నాగేశ్వరరావ పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

- మౌలిక సౌకర్యాలు మృగ్యం
- వర్షం వస్తే ఇళ్లలోకి చేరుతున్న మురుగునీరు
- పట్టించుకోని పాలకులు

దుర్భరం యానాదుల జీవనం..

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని లోతట్టు ప్రాంత మైన జాగుపాలెంలోని యానాది కాలనీ వాసులు నిత్యం మురుగు నీరుతో, విష జంతువులతో కాపురం చేస్తున్నామని వాపోతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు కట్టుకునే స్థలాల్లో తాము నివసిస్తున్నామని, వర్షం వస్తే పట్టణంలోని మురుగంగా ఇళ్ళలోకి చేరి దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు. కనీసం మౌలిక సదుపాయాలు లేక దుర్భర జీవితం అనుభవిస్తున్నామనా వాపోతున్నారు. జాగుపాలెంలో ఓగేరు వాగు కరకట్ట ప్రక్కనే వాగుకు ఆను కుని కరకట్ట ప్రక్కనే 35, 40 కుటుంబాలు గ్రేడ్ -1 మున్సిపాలిటీలో షుమారుగా 20, 25 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ కాలనీలోనే మహిళలు, పురుషులకు పట్టణంలో ఎవరు పనులు ఇవ్వరు. దీంతో ఏమిచేయాలో తెలియక వాగులోని చేపలను పట్టు కోవడం, చిల్ల కంపన చెరిగి కర్రల అమ్ము కోవటం పురుషులు చేస్తుంటే, మహిళలు ధనికుల ఇళ్లల్లో పాచి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారు తున్నాయి కానీ వీరి తలరాతలు మారడం లేదు. గత ప్రభుత్వ హయాములో కొంత మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. కొంత మందికి ఇవ్వ లేదు. ఇచ్చిన స్థలాలు ఎక్కడ ఉన్నాయో ఇంత వరకు చూపించ లేదంటున్నారు. కరెంటు బిల్లులు కట్టలేక పోతున్నా మంటున్నారు. ప్రభుత్వ పథకాలు తూతూ మంత్రంగా ఒకరిద్దరికి మాత్రమే వస్తున్నాయని, మిగిలిన వారికి రావడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో సంవత్సరానికి ఇస్తున్న 18000 ఆ గిపోయాయి. పిల్లలకు ఏఎంజి సహకారంతో చదువులతో పాటు మధ్యాహ్న భోజనం పెడుతున్నారన్నారు. పూరి గుడిసెకు, రేకుల షెడ్లకు సైతం విద్యుత్ బిల్లులు చెల్లించ లేనంత అధికంగా వస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. అలాగే ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

పనిదినాలు కల్పించాలి : సిఐటీయు

మహిళలకు, పురుషులకు గ్రామాల్లో అమలయ్యే పని దినాలను వీరికి కూడా కల్పించాలని సిఐటియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు పూనుకొని మౌలికసదు పాయాలను కల్పించాలని, ఉచిత విద్యకు తగిన ఏర్పాటు చేయాలని, 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును అమలయ్యే విధంగా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి..

అదే కాలనీ వాసి మాటల్లో సాయంత్రము ఉదయం చర్చిలో ప్రార్థనలు చేసుకుంటూ ఉంటామని చర్చికి ఇతర ఆదాయాలు ఏమీ లేవని తానే పాచిపని చేయగా వచ్చిన డబ్బులతో విద్యుత్తు బిల్లులు, ఇతర ఖర్చులు చెల్లించు కుంటున్నానన్నారు. ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని కోరారు.

పనులు ఇవ్వడం లేదు

బయట పనులకు వెళ్లినా ఇవ్వటం లేదదని కాలనీ నివాసి పొన్నూరు వెంక టస్వామి చెప్పారు. వర్షాకాలం, వేసవిలో వాగులో చేపలు పట్టుకునే అవకాశం ఉండదని, కరకట్టపై మొలిచే తుమ్మ ఇతర ముళ్ల కంప కర్రలు కొట్టుకునే అవకాశం ఉంటుదని, ఇతర కాలాల్లో చేపలు పట్టడం కర్ర కొట్టడం లాంటివి చేస్తుంటానన్నారు. పనులు లేని సమయాల్లో ఆడవారు పాచి పని చేయగా వచ్చే డబ్బులతో జీవనం కొనసాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

- పొన్నూరు వెంకటస్వామి, కాలనీ వాసి

కుటుంబ పోషణ కష్టంగా ఉంది

కనీస సదుపాయాలు అంటే ఏమిటో తెలియని స్థితిలో ఉన్నామని కాలనీ వాసి యాదగిరి భారతి తెలిపారు. ఇళ్లల్లో పాచి పని చేయగా నెలకు సందర్భాన్ని బట్టి 1000, 1500 రూపాయలు ఇస్తుంటారని, పెరిగిన ధరలకు అనుగుణంగా కుటుంబ జరగడం లేదని పాచిపని చేయగా వారు పెట్టే మిగిలిన అన్నం, కూరలతో కుటుంబాన్ని నెట్టుకు రావాల్సి వస్తుంద న్నారు. విద్యుత్తు వాడకం 18 రూపాయలు అయితే ఇతర చార్జీలు అదనపు చార్జీలని 168 రూపాయలు విధించారన్నారు.

-యాదగిరి భారతి, కాలనీ వాసి

ప్రభుత్వ పథకాలు రావడం లేదు

ప్రభుత్వ పథకాలు గాని, పింఛన్ గాని ఏమి రావటం లేదని కాలనీ వాసి మైనం వెంకమ్మ తెలిపారు. పింఛన్ సౌకర్యం కల్పిస్తే బాగుం టుందన్నారు. తన భర్తకు పూర్తి స్థాయిలో పనులు లేకపోవడం తాను పనేమి చేయలేక పోవడంతో నెలలో కొన్ని రోజులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు పట్టించుకోవాని కోరారు.

-మైనం వెంకమ్మ, కాలనీ వాసి

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు చెక్కుల అందజేత

ప్రజాశక్తి - చేబ్రోలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు చంద్రన్న భీమా ద్వారా ప్రభుత్వం తరపున నష్ట పరిహారం అందజేసిన పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్. ఆర్టీసీ బస్సు ఆటో ఢీకొని మినప కోత పనికి వెళు తున్న ముగ్గురు వ్యవసాయ కూలీలు ఫిబ్రవరి 17వ తేదీన చెందారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన రైతు కూలీలు నీరుకొండ గ్రామానికి పొలం పనులకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. భీమా చెక్కులను లబ్దిదారుల అల్లంశెట్టి అరుణ భర్త పెద నరసింహారావుకి రూ.5,00,000/- కుర్రా నాంచారమ్మా, భర్త మాధవరావుకి రూ.5,00,000/-, తోట సీతారావమ్మా , భర్త శివయ్యకి రూ.5,00,000/- సందర్భంగా లబ్ధిదారుల కుటుంబాల సభ్యులు కుటుంబంలో కుటుంబ పోషణ కోసం నిరంతరం కష్టపడి పని చేసే వ్యక్తిని కోల్పోవడంతో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, వెంటనే చంద్రన్న భీమా ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని, సహాయం చేసిన నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

అమరావతి శాశ్వత రాజధానిగా చట్టం, గెజిట్ నోటిఫికేషన్ చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నవ్యాంధ్ర చైతన్య వేదిక, ఊరూరా జన విజ్ఞానం మంగళగిరి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో రాజధాని ప్రాంతం ఎర్రబాలెం గ్రామం మసీదు వద్ద జరిగిన నవ్యాంధ్ర ప్రజా చైతన్య కార్యక్రమానికి మంగళగిరి ప్రాంత కమిటీ కన్వీనర్ కొడాలి రవిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి రాజధాని పునర్నిర్మాణం అభివృద్ధి పనులు వేగవంతంగా జరగాలని కోరారు. ఊరూరా జన విజ్ఞానం రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి లోని కృష్ణానది ఒడ్డున ట్యాంకు బండ్ ఏర్పాటు చేసి తెలుగు జాతి మహనీయులు, స్వాతంత్ర సమరయోధులు, అభ్యుదయ మహాకవి శ్రీశ్రీ విగ్రహాన్ని, అమర గాయకులు ఘంటసాల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. 2028 నాటికి రానున్న మూడు సంవత్సరాలలో 2014 రాష్ట్ర విభజన హామీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, నవ్యాంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతిలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి ఉద్యోగం కల్పించాలని, వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఊరూరా జనవిజ్ఞానం కమిటీ సభ్యులు, గాయకురాలు కె.రాజ్యలక్ష్మి, కొడాలి సాగరిక, కె.వి,నారాయణ, ఎస్.కె.సుభాని, కరిముల్లా, శ్రీ రామకృష్ణ, ధనలక్ష్మి, సుబ్బాయమ్మ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడికొండ

మండలంలోని పొన్నెకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాష అధ్యక్షతన ఉద్యోగులతో శనివారం సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా చాంద్ బాష మాట్లాడుతూ జూన్ 5వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సంఘానికి మద్దతు తెలిపాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోటాసాహేబ్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

31న జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సిఇఒ జ్యోతిబసు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన 1వ స్థాయి సంఘ సమావేశం (ప్రణాళిక-ఆర్థిక), 2వ స్థాయి సంఘం(గ్రామీణాభివృద్ధి), 4వ స్థాయి సంఘం(విద్య, వైద్యం), 7వ స్థాయి సంఘం(పనులు) సమావేశాలు జరుగుతాయన్నారు. అలాగే వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన 3వ స్థాయి సంఘం (వ్యవసాయం), తెనాలి జెడ్పీటిసి పిల్లి ఉమాప్రణతి అధ్యక్షతన 5వ స్థాయి సంఘం(స్త్రీ-శిశు సంక్షేమం), వైస్ చైర్మన్ బత్తుల అనురాధ 6వ స్థాయి సంఘం (సాంఘిక సంక్షేమం) సమావేశాలు జరుగుతాయన్నారు.

ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఫలితాల్లో

కేరళ మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల బిసి కాలనీలోని కేరళ మోడల్ స్కూల్ విద్యార్థి నరాల మనీష్ రెడ్డి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రన్స్ ఫలితాలలో ప్రతిభ చాటి సైనిక్ స్కూల్ కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గెల్లి గాలిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 5 న జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ 6 వ తరగతి ప్రవేశ పరీక్షకు మనీష్‌రెడ్డి హాజరయ్యారని అన్నారు. ఈ నెల 21 విడుదల అయిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలలో మంచి మార్కులు సాధించి ఎంపికయ్యారని, తమ స్కూల్ చిన్నారుల అబ్యాసన సామర్థ్యాలు గుర్తించి ఆ దిశగా ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల నేపథ్యంలో తమ విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పలు ప్రవేశ పరీక్షలలో అర్హత సాధిస్తున్నారని తెలిపారు. నీష్ రెడ్డిని ప్రిన్సిపాల్ గెల్లి గాలిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందించారు.

బహుమతులు అందచేస్తున్న పాఠశాల సెక్రెటరీ, ఉపాధ్యాయులు

కెఎల్‌పి స్కూల్లో ముగిసిన వేసవి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజిలోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో ఏప్రిల్ 25 నుండి మే 24వ తేదీ వరకూ నిర్వహించిన వేసవి శిక్షణ ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ హాజరయ్యారు.వేసవి శిక్షణలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. శాస్త్రీయ నృత్యం, వెస్టన్ డ్యాన్స్‌తో విద్యార్థులు అలరించారు. సింటాక్స్ స్క్వాడ్‌లో పిల్లలు పాల్గొని ఇంగ్లీషులో తమ నైపుణ్యాలను వెలిబుచ్చారు. బుక్ క్లబ్‌లో పిల్లలు వివిధ పుస్తకాలను చదివి, రీడింగ్ ఈజ్ ఫన్ అంటూ నాట్యరూపంలో ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. చదరంగం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, క్రికెట్, వాలీబాల్, కర్రసాము, స్కేటింగ్, ఫుట్‌బాల్ తదితర ఆటలు ఈ వేసవిలో శిక్షణలో నేర్పించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ మాట్లాడుతూ 160 మంది వేసవి శిక్షణలో పాల్గొన్నారన్నారు. ఇటువంటి శిబిరాలు విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవటానికి దోహదం చేస్తాయన్నారు. ఏఒ వెంకట్రావు మాట్లాడుతూ పిల్లల బాల్యం ఆనందంగా, ఆహ్లాదంగా ఉండాలన్నారు. అనంతరం వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించి, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుల్ని అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ బి.శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఎంఏఎం కళాశాల విద్యార్థులకు కొలువులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నరసరావుపేట మండలం కేశానుపల్లి గ్రామ పరిధిలో ఎంఏఎం కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 17 మంది విద్యార్థులు కొలువులు సాదించారని కళాశాలల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాలలో ద్వితీయ ఏడాది ఎంబీఏ, ఎంసీఏ, 4వ ఏడాది బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. హైదరాబాదుకు చెందిన త్రిషోల్డ్ సొల్యూషన్స్‌కు 5గురు, ఇన్ఫోకస్ బ్యాక్ గ్రౌండ్ చెక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 9 మంది, ఆక్రోసాఫ్ట్ సొల్యూషన్స్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల చైర్మన్ రామ శేషగిరిరావు అభినందించారు. తమ విద్యార్థులకు 100 శాతం ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతుల నేపథ్యంలో తమ కళాశాలలో బాహుళజాతి కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో కొలువులు సాధించి ఆయా కంపెనీలలో ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు, ఆయా విభాగాధిపతులు నవీన్, సితార, రాధిక, ఫణి బాబు, రవిశంకర్ పాల్గొన్నారు.

శంకర్‌విలాస్ ఆర్‌ఓబి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేసేలా సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి శంకర్ విలాస్ ఆర్‌ఓబి నిర్మాణ పనులపై ఆర్‌అండ్‌బి, మున్సిపల్, పోలీస్ , రైల్వే , విద్యుత్ , బిఎస్ఎన్ఎల్, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భార్గవ్‌తేజ మాట్లాడుతూ ఆర్‌ఓబీ పనులకు సంబంధించి పిల్లర్ల నిర్మాణ పనులు రెండు వారాల్లో ప్రారంభించేలా నిర్మాణ ఏజెన్సీని సమన్వయం చేసుకుంటూ మున్సిపల్ ఆర్‌అండ్‌బి, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ ఏజెన్సీకి హిందూ కళాశాల వైపు, లాడ్జి సెంటర్ వైపు ఫ్రీ కాస్ట్ మెటీరియల్ సిద్ధంచేసుకోవడానికి గుర్తించిన స్థలాలను మరోసారి పరిశీలించి మంగళవారం నాటికి వివరాలు తెలియ చేయాలన్నారు. ఆర్‌ఓబీ నిర్మాణ ప్రాంతంలోని విద్యుత్ స్తంభాలను పక్కకు తరలింపునకు మరోసారి విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి అంచనాలను మున్సిపల్ శాఖకు అందించాలన్నారు. ఆర్‌ఓబీ పనులు సజావుగా కొనసాగేలా సంబంధిత శాఖలు నిర్మాణ ఏజెన్సీతో నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ ఎన్ఎస్‌కె ఖాజావలి, కేంద్రగ్రామీణ అభివద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి ఓఎస్‌డి రూప్‌కుమార్, ట్రాఫిక్ డిఎస్పీ రమేష్‌బాబు జిఎంసి ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఆర్ అండ్ బి ఈఈ సమర్పణ రావు, విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు, రైల్వే, బిఎస్ఎన్ఎల్, ట్రాఫిక్ అధికారులు, నిర్మాణ సంస్థ లక్ష్మణ్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ

ప్రజాశాస్త్రవేత్త జయంత్ నార్లికర్

జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

వైజ్ఞానిక దృక్పథాన్ని, శాస్త్రీయతను సామన్య ప్రజల్లోకి తీసుకెళ్లటానికి విశేష కృషి చేసిన గొప్ప వ్యక్తి ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త జయంత్ నార్లెకర్ అని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం నార్లెకర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు మాట్లాడూత నార్లెకర్ మహారాష్ట్రలో మూఢనమ్మకాల నిరోధక చట్టం తేవటానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ నార్లెకర్ జాతీయ ఖగోళ శాస్త్ర సంస్థను ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దటంలో ఎంతో కృషి చేశారని తెలిపారు. టి.ఆర్.రమేష్ మాట్లాడుతూ ఇతను రాసిన సైన్స్ పుస్తకాలు ఎంతో ప్రాచుర్యం పొందాయని, ఇతనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా వచ్చిందన్నారు. ఇంకా పద్మభూషణ్, పద్మ విభూషణ్, డాక్టర్ నాయుడమ్మ స్మారక పురస్కారం, ఫ్రెంచ్ ఖగోళ్ల శాస్త్ర సంస్థ అవార్డు, ఇతర అనేక అవార్డులు వచ్చాయన్నారు. సమావేశంలో టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, టి.ఆర్.చాందిని, బి.ఉదయ్‌భాస్కర్, జి.వెంకటరావు, సదాశివరావు, ఎం.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

పదేళ్లుగా అమరావతికి దక్కని చట్టబద్ధత

అమరావతికి పదేళ్ల తరువాత చట్టబద్ధత అంశంపై సిఎం చంద్రబాబు కేంద్ర మంత్రులను కలిసి చర్చించడం రాజధాని వాసుల్లో ఆశలు చిగురించాయి. గత పదేళ్లుగా ఈ అంశంపై దృష్టిసారించని నేతలు ఇప్పుడు మేల్కొన్నారు. 2014-19మధ్య కాలంలోనే ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయాల్సిఉండగా అప్పట్లో పాలకుల అతివిశ్వాసం, రైతులకు అవగాహన లోపంతో చట్టపరంగా నిబంధనలు ప్రకారం రాజధానికి కనీస సదుపాయాలు లేకుండా పోయాయి. మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసి రాజధాని రైతులపై ప్రదర్శించిన దాష్టికం తరువాత రైతులు మేల్కొన్నారు. ప్రధానంగా భూములు ఇచ్చిన రైతులంతా తమ భవిష్యత్తుపై ఇప్పటికీ ఆందోళనగానే ఉన్నారు. మళ్లీ నాలుగేళ్ల తరువాత ప్రభుత్వం మారితే అన్న భయం వారిని వెంటాడుతోంది. ఇందువల్లే కొత్తగా వారు అమరావతికి ఎటువంటి ధోకా లేకుండా చట్టబద్ధత కల్పించాలని రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు తమ డిమాండ్ ఉంచారు. గత నెలలోనే రైతులు ఈ డిమాండ్‌ను సిఎం చంద్రబాబు ముందుంచారు. ఈనెల 2న రాజధాని పునర్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని మోడీకి ఈ అంశాన్ని ప్రస్తావించి హామీ పొందుతారని రాజధాని రైతులు ఆశించారు. అయితే ఈ సభలో సిఎం చంద్రబాబు, ఇతర మంత్రులు చట్టబద్ధత అంశాన్ని ప్రస్తావించకపోవడంతో రైతులు కొంత అసంతృప్తికి గురయ్యారు. ప్రధాని మోడీ వెలగపూడి సభలో ఎటువంటి హామీలు ఇవ్వకపోవడంపై కూడా రాజధాని రైతులు పెదవి విరిచారు. అయితే ఆ తరువాత రైతుల నుంచి వత్తిడి కొనసాగడం తో సిఎం చంద్రబాబు శుక్రవారం ఢిల్లీ పర్యటనలో ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారు. రాష్ట్ర రాజధానిగా అమరావతిని నోటిఫై చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కోరారు. ఇందుకు సంబంధించిన నివేదిక సమర్పిం చారు. వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే బిల్లు ప్రవేశ పెట్టాలని కోరారు. అమరావతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాల్సిన కొన్ని మౌలిక పరమైన అంశాల్లో గత 10 ఏళ్లుగా నిర్లక్ష్యం రాజ్యమేలింది. అమరావతికి ఇప్పటి వరకు శాశ్వతంగా పిన్‌కోడ్, ఎస్‌టిడి, ఐఎస్‌డి కోడ్ లేదు. రాజధాని నగరంగా కేంద్ర అర్బన్ డెవలప్ మంత్రిత్వ శాఖలో గుర్తింపు లేదు. అమరావతి పట్టణమో...పల్లే ప్రాంతమో ఏదీ తేల్చకుండా గత 10ఏళ్లుగా పాలకులు పట్టించుకోలేదు. రాజధాని ప్రాంతంలో మూడు మండలాలకు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌కు ఎన్నికలు జరపలేదు. ఇందువల్ల కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చేనిధులు రాకుండా పోయాయి. అమరావతిని మెగా కార్పొరేషన్‌గా మారు స్తామని ప్రకటనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. అమరావతి ప్రాంతాన్ని పోలీసు కమిషనరేట్‌గా మారుస్తామంటే అప్పట్లో పోలీసు, రెవెన్యూ శాఖలమధ్య సమన్వయ లోపంతో సాధ్యం కాలేదు. రాజధాని అమరావతిలో రాష్ట్ర సచివాలయం మినహాయిస్తే ఇక్కడ రెవెన్యూ పరంగా అత్యున్నత స్థాయి అధికారి తహశీల్దారు కాగా పోలీసుశాఖలో డిఎస్‌పి స్థాయి అధికారి మరో అత్యున్నత అధికారిగాఉన్నారు. అంతే తప్ప దేశంలో ఇతర రాజధానుల్లో మాదిరిగా జిల్లా కలెక్టరు, ఎస్‌పిలు,డిఐజిలు, ఐజి స్థాయి అధికారులు ఎవ్వరూ రాజధాని పరిధిలో లేరు. అమరావతిని రెవెన్యూ జిల్లాగా మార్చకపోవడం ఒక మైనస్‌పాయింట్‌గా మారింది. అమరావతిలో ఎలాంటి భారీ కార్యక్రమం చేయాలన్న ఇటుగుంటూరు నుంచి అటు విజయవాడ నుంచి ఉన్నతాధికారులు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితి దేశంలో ఏ రాజధానికిలేదు. రాజధాని ప్రాంతాన్ని వివిధ శాఖలకు జిల్లా స్థాయి హోదా లేకపోవడంకూడా పాలన పరంగా పెద్ద లోటుగా ఉంది. రాజధానితో నవ నగరాలను నిర్మిస్తామని ప్రకటించిన టిడిపి ప్రభుత్వం ఇప్పటికీ రాజధాని గ్రామాలన్నింటిని గ్రామ పంచాయతీలుగా కొనసాగిస్తోంది. దీనిని పట్టణ,నగర ప్రాంతంగా మార్చకపోవడంతో స్థానికంగా అభివృద్ధికి నోచుకోవడంలేదు. రాజధాని గ్రామాల్లో ఇప్పటికి మౌలిక సదుపాయాలు లేక ప్రజలంతా ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారులు, పాలకులు గమనించని దుస్థితినెలకొంది.

(ఎ.వి.డి.శర్మ)